క్లుప్తంగా

రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ



పెదనందిపాడు: రైతులకు పాస్ పుస్తకాలను గుంటూరు ఆర్డీవో ఎం ప్రభాకరరెడ్డి పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో ఆర్డీవో ప్రభాకర రెడ్డి రైతులకు రీ సర్వే పూర్తయిన సందర్భంగా పాస్ పుస్తకాలు అందజేశారు. మండలంలో రావిపాడు గ్రామానికి 808 పుస్తకాలు, అన్నవరం గ్రామానికి 427 పుస్తకాలు, రాజుపాలెం గ్రామానికి 294 పుస్తకాలు వచ్చినట్లు ఆయన చెప్పారు. లబ్ధిదారులు అందరికి మూడు రోజులలోపు పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ ఎం శ్రీదేవి, వీఆర్వోలు ఎం భార్గవి, పి.నాగమణి సిబ్బంది తదితరులు ఉన్నారు.

చల్లావారిపాలెం క్లాప్ మిత్రకు సత్కారం




గుంటూరు రూరల్: మండలంలోని చల్లావారిపాలెం గ్రామ క్లాప్ మిత్ర గోగుల శ్రీలక్ష్మికి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఘన సత్కారం లభించింది. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన సఫాయ్ మిత్ర, క్లాప్ మిత్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన చల్లావారిపాలెం క్లాప్ మిత్ర శ్రీలక్ష్మిను పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎంపీ గంధం చంద్రుడు శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చల్లావారిపాలెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సత్కారం అందుకున్న క్లాప్ మిత్రకు అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

పెదకాకాని: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నవరాత్రులు పందిళ్ళలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రసాదాల పంపిణీ జరిగింది. వినాయక చవితి వేడుకల్లో భాగంగా భక్తులు చివరి రోజు మంగళవారం అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఘనంగా గ్రామోత్సవం జరిపించారు. భక్తులు విఘ్నేశ్వరునికి పూజా ద్రవ్యములు సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు. మేళతాళాలు, కనకతప్పెట్లతో ముఖ్యంగా యువత, చిన్నారులు, మహిళలు సందడి చేశారు. అనంతరం సమీపంలోని గుంటూరు చానల్(కొత్తకాలువ)కు గణనాథుని నిమజ్జనం చేసేందుకు తరలివెళ్ళారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



గుంటూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ ఆరునెలలకు ఒకసారి రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పీ శ్రీరామచంద్రరాజ్ తెలిపారు. మంగళవారం నగర శివారులోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకరి రక్తదానం వల్ల ఆపదలో ఉన్నవారు, ప్రమాదాలకు గురైన ఎందరి ప్రాణాలనో కాపాడవచ్చన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ ఫాతిమా రాణి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచనల మేరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు 30 మందికిపైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ పిచ్చిరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రసూల్, డాక్టర్ ఎమ్ భాస్కరరావు, కళాశాల పీడీ బాల శౌరిరెడ్డి, డి.సైమన్, పి.సంధ్య, ఆర్ ఫణి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునీకరణ

- 30న బస్ స్టేషన్ పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- బస్టాండ్ అభివృద్ధికి రూ.25 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ప్రారంభానికి సిద్ధమైన పొన్నూరు ఆర్టీసీ బస్ స్టేషన్

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఆర్టీసీ (ప్రజా రవాణా సంస్థ) దినదినాభివృద్ధి చెందుతుంది. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించడమే కాకుండా ఆర్టీసీ అభివృద్ధికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుంది. శిథిలావస్థలకు చేరి దీనస్థితిలో ఉన్న బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరి ప్రజాదరణకు దూరమైన పొన్నూరు ఆర్టీసీ బస్ స్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టింది. రూ. 25 లక్షల ప్రభుత్వం మంజూరు చేసింది. వెంటనే బస్ స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంగా సాగాయి.

నెరవేరిన పొన్నూరు ప్రజల దశాబ్దాల కల...

పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరడంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి చర్యలతో బస్టాండ్‌కు మోక్షం లభించింది . ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కృషితో బస్ స్టేషన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెంది ఈనెల 30వ తేదీన పునః ప్రారంభానికి సిద్ధమైంది. బస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..

బస్ స్టేషన్‌ను అన్ని హంగులతో ఆధునీకరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బెంచీలు, బస్టాండ్ ఆవరణ, సీసీ రోడ్లు, టాయిలెట్స్ అభివృద్ధి, డిపోను రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులకు బస్ స్టేషన్‌ను త్వరితగతిన అందుబాటులో తెచ్చే విధంగా అధికారులు బాధ్యతలు నిర్వహించారు.

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

- ప్రారంభించిన ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా ప్రారంభమైన నియోజకవర్గస్థాయి ఎంపికలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి ఎంపికలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న పోటీలను తొలిరోజు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ, షటిల్ ఆడి ఎంపికలను ప్రారంభించారు. మంగళవారం ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రో బాల్, టెన్నికాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా ఎంపికలు అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల్లో మండల స్థాయి ఎంపికల్లో ఎంపికైన సుమారు 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటారు. ఉదయం ఓ మోస్తరు వర్షంతో ఆటంకం కలిగినప్పటికీ, మధ్యాహ్నం వర్షం లేకపోవడంతో క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు..

విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించిన ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఆటల్లో గెలుపోటములను స్పోర్టివ్‌గా తీసుకోవాలని, క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు హెచ్. శ్రీనివాసరావు, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డేవిడ్ రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ జి.ప్రతాప్‌రెడ్డి, మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై మాట్లాడిన జగనన్నకు థాంక్యూ



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్

గుంటూరు రూరల్: పది సంవత్సరాల నుంచి మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఎన్నో పోరాటాలు చేసి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని జాతీయ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ డేరంగుల ఉదయ్ కిరణ్ తెలిపారు. మంగళవారం సంఘం జాతీయ స్థాయి సమావేశాన్ని నగర శివారులోని ఓ ప్రైవేటు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఒక్క జగనన్నకే దక్కిందన్నారు. అత్యున్నతమైన రాష్ట్ర పదవులలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. మహిళలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. ఇటీవల పార్లమెంట్లో 33% చట్టబద్ధత కల్పించారని అందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. మహిళలకు చట్టబద్ధతతో ప్రత్యేక కోటా ఏర్పాటు చేస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో మహిళల కోటా కల్పించకపోవడంతో బీసీ మహిళలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ మహిళలకు ఎమ్మెల్యేగా పోటీ చేసే విధంగా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీ 'కుల జనగణన' చేయాలని పోరాటం చేసిన స్పందించడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకొని బీసీ 'కుల జనగణన' చేస్తే బీసీలు సామాజికంగా, రాజకీయంగా ఎదుగుతారని అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీ కుల జనగణనపై చర్చించడం ఎంతో శుభదాయకంగా ఉందని చెప్పారు. అందుకు జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆల్తి వెంకటేశ్వరి, జాతీయ కార్యదర్శి పిఎన్వీఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ముంజంపల్లి శివకుమార్, రహీమా, ఫరీదా, నహరాజ్, రెహానా, ఆషాద్, దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ అవసరం.. ఎంపీడీవో శ్రీరమ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీరమ్య, బ్యాంకు మేనేజర్లు రమాదేవి, మోహన్ సాయిసుహాస్

ప్రత్తిపాడు: మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరమని ఎంపీడీవో ఏ శ్రీరమ్య అన్నారు. ప్రత్తిపాడు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో శ్రీరమ్య కుటుంబంలో ప్రతి మహిళ ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే, ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయని చెప్పారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వేమ రమాదేవి మాట్లాడుతూ పొదుపు ఖాతాలను సక్రమంగా నిర్వహించుకోవడం వలన భవిష్యత్తులో బ్యాంకు నుంచి రుణాలు సులభంగా పొందవచ్చన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జె.మోహన్‌సాయి సుహాస్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకునే సొమ్ముకు బ్యాంకుల ద్వారానే పూర్తి భద్రత ఉంటుందన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు బ్యాంకు ద్వారా అందుతున్న విస్తృతమైన సేవలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. రుణాల కోసం కొందరు అభద్రతతో కూడిన మార్గాలను ఎంచుకుని ఆస్తులు, బంగారాన్ని తనఖా పెట్టి సర్వస్వం కోల్పోతున్నారని తెలిపారు. బ్యాంకులను సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్‌లిఫ్ట్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ తురకా మంగయ్య, విప్పర్ల విజయభాస్కర్, షేక్ బాజీ, కె. వెంకటేశ్వరరావు, బందెల వెంకటేశ్వర్లు, డ్వాక్రా వీవోఏలు, గ్రామసమాఖ్య సభ్యులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో విజ్ఞాన్ నిరులా విద్యార్థుల ప్రతిభ

రూ.11లక్షల వార్షిక వేతనంతో సత్తా చాటిన నిహారిక పార్వతి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక

గుంటూరు రూరల్: ప్రాంగణ నియామకాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రముఖ సంస్థల్లో కొలువులకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరు గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రముఖ బహుళజాతి సంస్థలు నిర్వహించిన ఎంపికల్లో మొత్తం 24 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. రూ.11లక్షల వార్షిక వేతనంతో ఫైనల్ ఇయర్ ఈసీఈ విభాగానికి చెందిన నిహారిక పార్వతి ఐబీయంలో ఉద్యోగం సాధించిందన్నారు. మరో 23మంది విద్యార్థినులు ఆక్సెంచర్ సంస్థకు ఎంపిక అయినట్టు తెలిపారు. మరికొన్ని ప్రాంగణ నియామక ఫలితాలు రావాల్సి ఉందని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎ.నరేష్ తెలిపారు. అత్యుత్తమ శిక్షణ ఇవ్వటం ద్వారా విద్యార్థుల నుంచి మంచి ఫలితాలు రాబడుతున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ సంస్థల ఉపాధ్యక్షులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విద్యార్థులను అభినందించారు.

వీవీఐటీ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఎం.వినీత బయోమెడిక్ అప్లికేషన్స్‌పై చేసిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని వీవీఐటీ కళాశాలలో మంగళవారం చైర్మన్ మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినీత మెగ్నీషియం మిశ్రమం, ట్రికాల్షియం ఫాస్ఫేట్, రీన్ఫోర్‌మెటల్ మ్యాట్రిక్స్ మిశ్రమ పదార్థాలను బయోమెడికల్ అప్లికేషన్స్‌లో వినియోగించవచ్చని తెలుపుతూ పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ ఎం గోపీకృష్ణ పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. అనంతరం వినీతను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ కుమారస్వామి, డీన్ ఫైనాన్స్ డాక్టర్ సత్యన్నారాయణ, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావులు అభినందించారు.

మినుములో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

గుంటూరు రూరల్: మినుము అపరాల పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టాలని లాం ఫాం కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం సామూహిక క్షేత్రస్థాయి ప్రదర్శన, రైతు అవగాహన సదస్సులో భాగంగా కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామం రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటలో సరైన సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు వినియోగించి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి మాట్లాడుతూ జీవన ఎరువులైన రైజోబియం, పీఎస్‌బీ ఫాస్ఫరస్, సాల్యులైజింగ్ బ్యాక్టీరియం, పొటాషియం, రిలీజింగ్ బ్యాక్టీరియంను వానపాముల ఎరువులో కలిపి భూమిలో కలిపి దున్నుకోవటం వల్ల రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు ఎల్‌బీజీ 884, జీవన ఎరువులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.దీప, రైతులు తదితరులున్నారు.



హెచ్‌ఎంలకు జగనన్న గోరుముద్ద వంట సామగ్రి అందజేత



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద చేపట్టినట్లు ఎంఈఓ-1 కె.ఎఫ్.కెనడీ అన్నారు.స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు వంట సామగ్రి పాత్రలను అందచేశారు.

ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యర్థుల సంఖ్యకు అనుగుణంగా వంట పాత్రలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. దీని వలన ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసే నిర్వాహకులకు ఎలాంటి సమస్యలు ఉండవని ఆయన తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 విజయ్ భాస్కర్, హెచ్‌ఎం సాయిరాం ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందించండి



ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: పొన్నూరులోని సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయం ట్రస్టీలు, స్థానిక టీడీపీ నాయకులు ఆలయ అభివృద్ధిని ఆటంకపరుస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో పలు విషయాలను సభ దృష్టికి తీసుకువెళ్లారు. పొన్నూరులోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం, పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం, చేబ్రోలులోని శ్రీ బ్రహ్మ గుడి ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. వాటి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంది. ప్రధానంగా పొన్నూరులోని అత్యంత పురాతనమైన, ఆస్తులు కలిగి ఉన్న శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయం సరైన వ్యవహారం, వ్యవస్థ లేకపోవడంతో గత ఐదు సంవత్సరాల క్రితం వరకు ప్రతిరోజు భక్తులు పదిమంది కూడా రాని పరిస్థితి నెలకొంది అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో ఆలయం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సీజీఎఫ్ గ్రాంట్ రూ.45 లక్షల, దాతలు రూ.25 లక్షలతో ఆలయం అభివృద్ధి చేస్తున్నామన్నారు. హిందూ ధర్మం ప్రకారం ప్రతి 11 సంవత్సరాలకి ఒకసారి కుంభాభిషేకం చేస్తే ఆలయానికి రీ పవర్ వస్తుందన్న సంకల్పంతో నవంబర్‌లో చేసే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ట్రస్టీలు ఆలయ అభివృద్ధిని ఆటంకపరుస్తున్నారన్నారు. ట్రస్టీలు ఆధిపత్యం చలాయించడం తప్ప అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. ఆలయ ఆస్తులు 900 ఎకరాల నుంచి నేడు 270 ఎకరాలకు చేరిందన్నారు. గత టీడీపీ హయాంలో 300 ఎకరాల వరకు అమ్ముకున్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధితోపాటు ప్రజల వినతి మేరకు ఆటోనగర్ నిర్మించాలని ఆలోచన చేశామన్నారు. ఆ విషయాన్ని కూడా టీడీపీ నాయకులు, ట్రస్టీలు కలిసి నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో తెలుగుదేశం దుష్ప్రచారం పార్టీగా మారిందన్నారు. వారు ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలకు తోడ్పాటును అందించట్లేదని సభాదృష్టికి తీసుకొచ్చారు. దేవదాయ శాఖ మంత్రి శ్రీ భావన్నారాయణ స్వామి ఆలయ ట్రస్టీల విషయంలో ఒక మంచి నిర్ణయం తీసుకొని ప్రజలకు మేలు చేయాలని కోరారు.

ఓటరు సర్వే సక్రమంగా చేయాలి

ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న హరిహరనాథ్

పొన్నూరు: నియోజకవర్గంలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేను సక్రమంగా చేయాలని ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఓటరు సర్వేపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రతినిధులు సర్వేపై పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హరిహరనాథ్ మాట్లాడుతూ ఓటర్ సర్వేపై ఎలాంటి సమస్యలు ఫిర్యాదులు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ నాయకులు అడిగిన ఏ సమాచారమైన వెంటనే అందిస్తామని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం గ్రామాల్లో ఒక్క పోలింగ్ కేంద్రాన్ని కూడా మార్చకూడదని, అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, తహసీల్దార్లు కేదారినాథ్ శ్రీకాంత్, గోపాలకృష్ణ, ఎలక్షన్ డి.టి.ఫణి కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు రక్తహీనతను అధిగమించాలి

ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం



ఆకుకూరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ వెంకటరత్నం

ప్రత్తిపాడు: మహిళల్లో రక్తహీనతతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ ప్రత్తిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వెంకటరత్నం అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రత్తిపాడు సెక్టార్‌లోని నిమ్మగడ్డవారిపాలెం, గొట్టిపాడు సెక్టార్‌లోని గొట్టిపాడు డీడబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రాలలో మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు ఆకుకూరలు, పండ్లు అధికంగా తినాలన్నారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ప్రసవం అయ్యే వరకూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు హెచ్‌బీ పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.కళాధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారక, మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గ్రీష్మాచౌదరిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం జోస్‌మేరి

ప్రత్తిపాడు: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ముట్లూరు హైస్కూల్ విద్యార్థిని ఎంపికయ్యింది. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ జాతీయ స్థాయిలో ఐటీ రూరల్ క్విజ్ -2023 పోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం గుంటూరులోని డీసీఈబీ సెమినార్ హాలులో డీఈవో, డీఎస్‌వోల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు జరిగాయి. అందులో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.గ్రీష్మాచౌదరి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈ సందర్భంగా బాలికను, శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయుడు వి.ఎస్.రామాంజనేయులును పాఠశాల హెచ్‌ఎం టి.జోస్‌మేరి, ఉపాధ్యాయులు అభినందించారు. అక్టోబరు నాల్గవ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో గ్రీష్మా పాల్గొననున్నట్లు రామాంజనేయులు తెలిపారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పెదకాకాని: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మంగళగిరి గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్ ప్రతినిధి అనూష తెలిపారు. పెదకాకాని వడ్డెరకాలనీలో మంగళవారం బాల్య వివాహాలు, లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుడ్‌షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధి, చైల్డ్ ప్రొటెక్ట్ కోఆర్డినేటర్ కె.అనూష మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు, పురుషులు సమానంగానే ఉన్నప్పటికీ స్త్రీలను చిన్న చూపు చూస్తున్నారన్నారు. ఇప్పటికీ సమాజంలో పుత్రులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వివక్ష చూపుతున్నారన్నారు. పిల్లల పట్ల లింగవివక్ష చూపడం వలన వారు మానసికంగా కృంగిపోతారన్నారు. అలానే ఆడపిల్లలకు 18 సంవత్సరాలు వయస్సు నిండకుండా వివాహం జరిపించడం నేరమని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఆదిలక్ష్మి, మహిళా పోలీసు మధులత, సంస్థ కోఆర్డినేటర్లు నాగలక్ష్మి, అనిల్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.